క్లుప్తంగా

కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలి



వెంకటాపురం(కె): రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలని స్థానిక పీఏసీఎస్ కార్యదర్శి సత్యనారాయణ కోరారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి ప్రభుత్వం అందిస్తున్న మద్దతు ధర పొందాలని సూచించారు. దళారులను ఆశ్రయించి మోసపోవద్దని చెప్పారు. 'ఏ' గ్రేడ్ ధాన్యం క్వింటాకు రూ.2203, కామన్ గ్రేడ్‌కు రూ.2183 ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించిందని తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకుని లబ్ధిపొందాలని కోరారు. కార్యక్రమంలో సొసైటీ సిబ్బంది పూర్ణ పాల్గొన్నారు.

రేషన్ బియ్యం స్వాధీనం

మొగుళ్లపల్లి: అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై శ్రీధర్ తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం ఆదివారం రాత్రి మండలంలోని ఇస్సిపేట గ్రామంలో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా ఇస్సిపేట గ్రామ చెరువు వద్దకు వెళ్లేసరికి జూకల్లు గ్రామానికి చెందిన మేర్తేల నాగరాజు నంబర్ లేని టాటా 207 ఆర్ఎక్స్ ట్రాలీలో రేషన్ బియ్యాన్ని తరలిస్తుండగా పట్టుకున్నట్లు ఎస్సై శ్రీధర్ తెలిపారు. విచారించగా చిట్యాల మండలం జూకల్ గ్రామానికి చెందిన సురాబు రాజు సూచనల మేరకు అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్నానని నాగరాజు తెలిపాడని వెల్లడించారు. ట్రాలీలో సుమారు 10 క్వింటాళ్ల రేషన్ బియ్యం ఉన్నట్లు గుర్తించి, ట్రాలీని సీజ్ చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఆర్థిక సాయం

టేకుమట్ల: మండలంలోని వెలిశాల గ్రామానికి చెందిన యువతి గందం శ్రీలేఖ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా ఆమె కుటుంబ సభ్యులను బాల్య మిత్రులు సోమవారం పరామర్శించి, తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అనంతరం ఆమె కుటుంబ సభ్యులకు రూ.5,000 అందించారు. ఆర్థిక సాయం అందించిన వారిలో బొల్లికొండ వెంకటేష్, సృజన, త్రివేణి, రజినికాంత్, నాగరాజు, రాకేష్, బ్రహ్మం, రాజు, రాకేష్, రాజేందర్, నరేష్, కుమార్, నవత, కిరణ్, తదితరులు ఉన్నారు.

కమ్యూనిస్టు పార్టీని ఆదరించండి

టేకుమట్ల: డబ్బు సంచులతో ఓటర్లను ప్రలోభాలకు గురి చేసే నాయకులకు కాకుండా, ప్రజల పక్షాన పోరాడుతున్న కమ్యూనిస్టు పార్టీ నాయకులను ప్రజలు ఆదరించి, గెలిపించాలని సీపీఐ ఎంఎల్ భూపాలపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి మారెపెల్లి మల్లేష్ అన్నారు. సోమవారం మండలంలోని రాఘవరెడ్డిపేట, దుబ్యాల, మందలోరిపల్లిలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు.

చెరువులో పడి వ్యక్తి మృతి

గణపురం: భూపాలపల్లి జిల్లా కేంద్రానికి చెందిన సబ్బాని కిరణ్(32) గణపురం మండలకేంద్రంలోని గణపసముద్రం చెరువులో ఆత్మహత్య చేసుకున్నాడు. గణపురం ఎస్సై మచ్చ సాంబమూర్తి తెలిపిన వివరాల ప్రకారం.. భూపాలపల్లి పట్టణానికి చెందిన కిరణ్ బట్టల వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో కిరణ్ ఈ నెల 26న ఉదయం ఇంట్లో నుంచి బయటకు వెళ్లి తిరిగి ఇంటికి చేరలేదు. ఫోన్ స్విచ్ఆఫ్ ఉంది.. దీంతో కుటుంబ సభ్యులు భూపాలపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. సోమవారం సాయంత్రం గణపసముద్రం చెరువులో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం ఉందని తమకు సమాచారం అందడంతో అక్కడికి వెళ్లి పరిశీలించగా భూపాలపల్లికి చెందిన కిరణ్‌గా గుర్తించినట్లు తెలిపారు. కిరణ్‌ది ఆత్మహత్యా.. లేదా మరేమైన కారణాలు ఉన్నాయా.. అనే కోణంలో విచారణ చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఘనంగా కార్తీక పౌర్ణమి వేడుకలు



ఏటూరునాగారం: ధ్వజస్తంభం వద్ద పూజ చేస్తున్న భక్తులు



ఏటూరునాగారం: శివాలయంలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు

ఏటూరునాగారం: మండల ప్రజలు కార్తీక పౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. శివాలయాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. మండల కేంద్రంలోని ఉమారామలింగేశ్వరస్వామి, రామన్నగూడెంలోని శివాలయం, రాజన్నగుట్టలోని శివాలయంలో భక్తులు పూజలు చేశారు. 365 వత్తులతో దీపాలను వెలిగించారు. నాగుపాము పుట్టల వద్ద పాలు పోసి పూజ చేశారు. గోదావరి నదిలో స్నానాలు ఆచరించి హారతి ఇచ్చి గంగాదీపాలను వదిలారు.

జ్వాలా తోరణం

మండల కేంద్రంలోని శివాలయంలో గడ్డితో జ్వాలా తోరణం తయారు చేయగా అర్చకుడు రాజ్‌కుమార్ నిప్పుపెట్టారు. అందులోని శివపార్వతుల ఉత్సవ విగ్రహాలను దాటించిన తర్వాత భక్తులు ఆ మంటల్లోంచి నడిచారు.

వాజేడు: మండలవ్యాప్తంగా కార్తీక పౌర్ణమి వేడుకలను భక్తులు ఘణంగా జరుపుకున్నారు. ఉసిరికాయలు, ఆకులను నీటిలో వేసి స్నానాలు ఆచరించారు. పలువురు భక్తులు గోదావరిలో పుణ్య స్నానాలు చేశారు. గోదావరి వద్ద పూజలు నిర్వహించారు. పుట్టలో పాలు పోసి భక్తి చాటుకున్నారు.

భక్తిశ్రద్ధలతో..

మంగపేట: మండలంలో ప్రజలు కార్తీక పౌర్ణమి వేడుకలను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. పలువురు మహిళలు, అయ్యప్పస్వామి భక్తులు గోదావరి వద్ద పుణ్య స్నానమాచరించి మండల కేంద్రంలోని ఉమాచంద్రశేఖరస్వామి, మల్లూరులోని శ్రీ శంభులింగేశ్వరస్వామి, రాజుపేటలోని కొండ లింగేశ్వరస్వామి ఆలయాల్లో శివపార్వతులకు పూజలు నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే భక్తులు తరలిరావడంతో ఆలయాలు కిటకిటలాడాయి. ఆలయాల్లో అర్చకులు ఉదయం సుప్రభాత సేవ, మధ్యాహ్నం మహన్యాస పూర్వక రుద్రాభిషేకాలు చేశారు. పలువురు దంపతులు సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. ఆలయాలు దీపపు కాంతులతో ఆహ్లాదాన్ని పంచాయి.

నాగులమ్మ ఆలయంలో..

కార్తీక పౌర్ణమి సందర్భంగా మండలంలోని వాగొడ్డుగూడెం పంచాయతీ పరిధిలోని లక్ష్మీనర్సాపురం శ్రీనాగులమ్మ ఆలయంలో సోమవారం భక్తుల సందడి నెలకొంది. ఆలయ మేనేజింగ్ ట్రస్టీ, నాగులమ్మ ఉపాసకుడు బాడిష రామకృష్ణ స్వామి ఆధ్వర్యంలో ప్రధాన పూజారి నాగరమేశ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేశారు. పలువురు మహిళలు రాజుపేట సమీపంలోని గోదావరి వద్ద స్నానాలు ఆచరించి పూజలు చేశారు. నాగులమ్మ అమ్మవారి పుట్ట వద్ద మహిళలు నాగమయ్యకు పూజలు చేసి పుట్టలో పాలుపోశారు. కోడిగుడ్లు, పిండి వంటలు, పండ్లు నైవేద్యంగా సమర్పించారు. తిమ్మంపేట, మల్లూరు, చెరుపల్లి, బోరునర్సాపురం తదితర గ్రామాల్లో మహిళలు నాగులమ్మ పుట్ట వద్ద పూజలు చేసి పుట్టలో పాలుపోశారు.

వెంకటాపురం(కె): మండలంలో సోమవారం కార్తీక పౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మహిళలు తెల్లవారుజామునే గోదావరి నదిలో స్నానాలు ఆచరించి ఒడ్డున తులసి గద్దెలు ఏర్పాటు చేసి గౌరమ్మను పూజించారు. అనంతరం కుంకుమ, పసుపులను గోదావరికి సమర్పించి అరటి డొప్పల్లో దీపాలు వెలిగించి వదిలారు. మండల కేంద్రంలోని శివాలయంలోని ఉసిరి చెట్టు కింద పలువురు మహిళలు దీపాలు వెలిగించి పూజలు చేశారు. శివాలయంలో కార్తీక పౌర్ణమి సందడి నెలకొంది. భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఉదయం నుంచే భక్తుల తాకిడి మొదలవగా ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. అయ్యప్ప భక్తులు, శివమాలధారులు గోదావరి నది వద్ద పూజలు నిర్వహించి దీపాలను వెలిగించారు. ఆలయ ప్రాంగణంలోని పుట్టలో పాలు పోసి మొక్కులు చెల్లించారు.



వాజేడు: పుట్టలో పాలు పోస్తున్న మహిళలు



మంగపేట: పాలు పోస్తున్న భక్తులు



వెంకటాపురం(కె): దీపాలు వెలిగిస్తున్న భక్తులు

అధికారంలోకి రాగానే రూ.2లక్షల రుణమాఫీ



గోవిందరావుపేట: ర్యాలీలో సీతక్క, అశోక్



ప్రచారంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సీతక్క

- ఎమ్మెల్యే సీతక్క

ములుగు రూరల్: కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన వెంటనే రైతుల పంట రుణాలను రూ.2లక్షలను ఏకకాలంలో మాఫీ చేస్తామని ములుగు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ధనసరి సీతక్క అన్నారు. ఈ మేరకు మండలంలోని జాకారం, బండారుపల్లి, జీవింతరావుపల్లి గ్రామాల్లో ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రచారానికి వచ్చిన సీతక్కకు ప్రజలు బ్రహ్మరథం పట్టి స్వాగతం పలికారు. అనంతరం సీతక్క మాట్లాడుతూ పోడు సాగు చేసుకుంటున్న గిరిజనులు, గిరిజనేతరులు అనే బేధం లేకుండా అందరికి పోడు పట్టాలను అందిస్తామని అన్నారు. కార్యక్రమంలో కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు గొల్లపల్లి రాజేందర్ గౌడ్, ప్రవీణ్‌కుమార్, జయపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

రైతులకు అండగా నిలబడుతా..

గోవిందరావుపేట: కావాలని కొందరు అధికార పార్టీ నేతలు నా మీద దుష్ప్రచారం చేస్తున్నారని దమ్ముంటే నిరూపించాలని, ఎవరి భూములు గుంజుకున్న చరిత్ర తనకు లేదని, సాగు చేసుకునే ప్రతి రైతుకు పట్టా బుక్కులు అందించి అండగా నిలబడుతా అని సీతక్క అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని మచ్చాపూర్ నుంచి పస్రా వరకు నిర్వహించిన బైక్ ర్యాలీలో ములుగు కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి సీతక్క అన్నారు. మండల కేంద్రంలోని మచ్చాపూర్, చల్వాయి, గోవిందరావుపేట, పస్రా గ్రామాల్లో మండల అధ్యక్షుడు పాలడుగు వెంకటకృష్ణ ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారంలో భాగంగా బైక్ ర్యాలీ నిర్వహించారు. సీతక్క హాజరై మాట్లాడారు. జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి

ఎస్ఎస్‌తాడ్వాయి: కాంగ్రెస్ పార్టీతోనే ప్రజల అభివృద్ధి సాధ్యమవుతుందని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఎమ్మెల్యే సీతక్క అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని నర్సింగాపూర్, ఇందిరానగర్, తాడ్వాయి గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. మండల అధ్యక్షుడు బొల్లు దేవేందర్, జిల్లా సీనియర్ నాయకుడు బొల్లు రమేష్, సర్పంచ్ సునీల్, నాయకులు పాక సాంబయ్య, లచ్చుపటేల్, సారయ్య, పాక రాజేందర్ పాల్గొన్నారు.

సీతక్కకు విశ్వబ్రాహ్మణుల మద్దతు

సీతక్కకు విశ్వకర్మ (విశ్వ బ్రాహ్మణ)లు మద్దతు తెలిపినట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు శివపెల్లి రాజేశం, అందె భాస్కరాచారి సోమవారం తెలిపారు.

పస్రా చేరుకున్న పారామిలటరీ బలగాలు



ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్న పస్రా ఎస్సై షేక్ మస్తాన్

గోవిందరావుపేట: రానున్న ఎన్నికల నేపథ్యంలో పస్రా పోలీస్ స్టేషన్‌కు కేంద్ర పారామిలటరీ కంపెనీకి చెందిన బలగాలు వచ్చాయని పస్రా ఎస్సై షేక్ మస్తాన్ అన్నారు. ప్రజలు ఎలాంటి భయం, ప్రలోభాలకు లోను కాకుండా తమ ఓటు హక్కును వినియోగించుకోవడానికి అవగాహన కల్పించేందుకు ఫ్లాగ్ మార్చ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పస్రా ఎస్సై మాట్లాడుతూ ప్రజలు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవడానికి వీలుగా అవసరమైన అన్ని ఏర్పాట్లను పోలీస్ శాఖ చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో కేంద్ర పారామిలటరీ బలగాల ఇన్‌స్పెక్టర్ ఎండీ అబ్బాస్ ఖాన్ పాల్గొన్నారు.

ఎన్నికల వేళ కలకలం..

- ఎలక్షన్ బహిష్కరించాలని పలిమెలలో మావోయిస్టు పోస్టర్లు



మండల కేంద్రంలో వెలసిన మావోయిస్టు పోస్టర్

పలిమెల: ఏజెన్సీలో మావోయిస్టుల పోస్టర్లు కలకలం సృష్టించాయి. ప్రజా సమస్యల పరిష్కారంలో విఫలమైన రాజకీయ పార్టీలు, నాయకులను ప్రశ్నించాలని, సామాజిక, ఆర్థిక సమస్యలు పరిష్కరించే వరకు ఈ బూటకపు ఎన్నికలు బహిష్కరించాలని ఏటూరునాగారం - మహదేవ్‌పూర్ ఏరియా కమిటీ, భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) పేరుపై ఆదివారం రాత్రి మండల కేంద్రంలో పోస్టర్లు వెలిశాయి. ఆదివాసీ ప్రాంతాలకు స్వయం ప్రతిపత్తి కల్పించాలని, జల్- జంగల్- జమీన్ పై పూర్తి అధికారం ఆదివాసీలకే ఉండాలని, పెసా చట్టం, 5వ, 6వ షెడ్యూల్, 1/70 చట్టం, జీవో 3ని అమలు చేయాలని, పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని, హరితహారం పేరుతో ఆదివాసీలను అడవుల నుంచి తరిమి వేయడాన్ని మానుకోవాలనే తదితర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలు పరిష్కరించని రాజకీయ పార్టీలు, నాయకులను ప్రజలు నిలదీయాలని ఆ పోస్టర్లలో పేర్కొన్నారు.

'డబుల్ ఇంజన్ సర్కార్‌తో అభివృద్ధి'



ఓటు అభ్యర్థిస్తున్న చందుపట్ల కీర్తిరెడ్డి

భూపాలపల్లి రూరల్: బీజేపీ ద్వారానే అన్ని వర్గాల వారికి లాభం చేకూరుతుందని అభివృద్ధి, సంక్షేమం, డబుల్ ఇంజన్ సర్కార్ వల్లనే సాధ్యమవుతుదని భూపాలపల్లి బీజేపీ అభ్యర్థి చందుపట్ల కీర్తిరెడ్డి అన్నారు. సోమవారం భూపాలపల్లి పట్టణంలోని మొయిన్‌రోడ్‌లో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో కీర్తిరెడ్డి ఓట్లను అభ్యర్థించారు. ఈసందర్భంగా షాపుల యజమానులు కీర్తిరెడ్డికి ఘనంగా స్వాగతం పలికారు. సన్మానించారు. కేంద్ర ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి నిధులు కేటాయిస్తే రాష్ట్ర ప్రభుత్వం తమ నిధులుగా చెప్పుకుంటుందని మండిపడ్డారు. అన్ని వర్గాల ప్రజలను మోసగించిన బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలకు ఓటుతో గుణపాఠం చెప్పి నవంబర్ 30న జరిగే ఎన్నికల్లో బీజేపీ కమలం గుర్తుకు ఓట్లు వేసి ఆదరించాలని కీర్తిరెడ్డి వేడుకున్నారు. భూపాలపల్లి నియోజకవర్గంలో ఓటర్లంతా బీజేపీ వైపు నిలుస్తున్నారన్నారు. కాంగ్రెస్ బీఆర్ఎస్ హయాంలో ప్రజలకు చేసింది ఏమీ లేదన్నారు. సుస్థిర పాలన కేవలం బీజేపీతోనే సాధ్యమన్నారు. రైతును రాజు చేయడమే బీజేపీ లక్ష్యమని అన్నారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం కమలం పువ్వు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. గెలిచిన తర్వాత భూపాలపల్లికి ఇంజనీరింగ్, మైనింగ్ కళాశాలలతో పాటు, రైల్వేలైన్ తెప్పిస్తానన్నారు. జిల్లాను పర్యాటకంగా అభివృద్ధి చేసి యువతకు ఉపాధి కల్పించే విధంగా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ ప్రచారంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు యుగేందర్, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు బట్టు విజయ్‌కుమార్, అర్బన్ అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

జోరు పెంచిన బీఆర్ఎస్ కార్యకర్తలు



నాగజ్యోతి గెలవాలని రామాలయంలో పూజలు చేస్తున్న కార్యకర్తలు



సమావేశంలో మాట్లాడుతున్న నెమలి బాలకృష్ణ

- బీఆర్ఎస్ ప్రభుత్వం రావాలని మహిళలు ప్రత్యేక పూజలు

గోవిందరావుపేట: మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రచారం తారస్థాయికి చేరింది. కార్యకర్తలు గ్రామ గ్రామాన, గడప గడపన తిరుగుతూ బీఆర్ఎస్‌కు ఓట్లు వేసి తెలంగాణ గడ్డమీద ముచ్చటగా మూడోసారి బీఆర్ఎస్ ప్రభుత్వం రావాలని ప్రచారం నిర్వహిస్తున్నారు. గత తొమ్మిదిన్నర సంవత్సరాల్లో ముఖ్యమంత్రి కేసీఆర్ చేసిన అభివృద్ధి పనులను వివరిస్తూ మరల బీఆర్ఎస్ ప్రభుత్వం గద్దెనెక్కితే ఇంకా ఎన్నో పథకాలు మన ముందు ఉంటాయమని.. మరెన్నో అభివృద్ధి పనులు చేస్తారని వివరిస్తూ.. ప్రజలకు బొట్టు పెడుతూ సీనియర్ కార్యకర్త యాస పూలమ్మ ప్రచారం నిర్వహించారు. సోమవారం కార్తీక పౌర్ణమి పుష్కరించుకొని మహిళా కార్యకర్తలు రామాలయం నందు కేసీఆర్ మరోసారి ముఖ్యమంత్రి కావాలని, తెలంగాణలో గులాబీ జెండా ఎగరాలని, ములుగు ఎమ్మెల్యేగా బడే నాగజ్యోతి అత్యధిక మెజారిటీతో గెలవాలని పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో బద్దం జయమ్మ, వనపర్తి దేవి, యానాల ఉపేంద్ర, మేడబోయిన కీర్తి, బద్దం ఉపేంద్ర, బురెడ్డి విజయ, కొల్లు బుచ్చమ్మ, ఏనుగు వెంకటమ్మ, లకావత్ వనజ తదితరులు పాల్గొన్నారు.

నాగజ్యోతిని గెలిపించాలి

ములుగు ఎమ్మెల్యేగా బడే నాగజ్యోతిని గెలిపించాలని తెలంగాణ దళిత ఐక్యత సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు నెమలి బాలకృష్ణ కోరారు. మండల కేంద్రంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దళిత రైతుల అసైన్డ్ భూములకు పట్టాలిచ్చి హక్కులు కల్పిస్తామని బీఆర్ఎస్ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ నేపథ్యంలో నాగజ్యోతికి తాము మద్దతిస్తున్నట్టు తెలిపారు. కాంగ్రెస్ హయాంలో దళితులకు అన్యాయం జరిగిందన్నారు. నాయకులు దుడపాక రాజేందర్, వేల్పుల శ్రీకాంత్, దర్శనాల సంజీవ, మంథని రాజేందర్, అమరాపు గాంధీ, బాబు, భద్రయ్య, యాకోబ్ పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి ఓటేయండి

రేగొండ: భూపాలపల్లిలో జరిగిన అభివృద్ధిని చూసి ఓటేయాలని బీఆర్ఎస్ అభ్యర్థి గండ్ర వెంకటరమణా రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని రాజక్కపల్లి, విజ్జయ్యపల్లి, చిన్నకోడెపాక, బాలయ్యపల్లి, దామరంచపల్లి, చెన్నాపూర్, రూపిరెడ్డిపల్లి, తిరుమలగిరి, జూబ్లీనగర్, రామన్నగూడెం తండా, కొడవటంచ గ్రామాల్లో ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్యతో కలిసి ప్రజా ఆశీర్వాద యాత్ర ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గండ్ర మాట్లాడుతూ.. భూపాలపల్లిలో అన్ని వర్గాల అభివృద్ధి కోసం కృషి చేశానన్నారు. కేసీఆర్ ప్రభుత్వం రాష్ట్రంలో అనేక సంక్షేమ పథకాలు అమలు చేసి పేద ప్రజల అభ్యున్నతే ధ్యేయంగా పని చేస్తున్నదని అన్నారు. పల్లెలు, పట్టణాలను సమగ్రంగా అభివృద్ధి చేసిన పార్టీకి ప్రజలంతా అండగా నిలువాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సాయిని విజయ, మండల అధ్యక్షుడు మటిక సంతోష్, అంకం రాజేందర్, పీఏసీఎస్ చైర్మన్ వెంకటేశ్వరరావు జిల్లా నాయకుడు ఉమేష్ గౌడ్, సర్పంచ్‌లు పాతపల్లి సంతోష్, చందు, ఐలయ్య, నీలా, ప్రణతి ఎంపీటీసీలు ఐలి శ్రీధర్, హామీద్, కవితసామ్రాట్, రమేష్ నాయకులు బండి కిరణ్, నీలాంబరం, అమ్ముల రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటా ప్రచారం నిర్వహించిన నాయకులు

మొగుళ్లపల్లి: మండల కేంద్రంలో సోమవారం భూపాలపల్లి బీఆర్ఎస్ అభ్యర్థి గండ్ర వెంకటరమణారెడ్డి గెలుపు కోరుతూ పార్టీ నాయకులు సోమవారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిందన్నారు. సంక్షేమ పథకాలు అమలు చేయాలంటే మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి రావాలన్నారు. భూపాలపల్లి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసిన గండ్ర వెంకటరమణారెడ్డిని మళ్లీ గెలిపించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మోటె ధర్మారావు, పీఏసీఎస్ చైర్మన్ సంపెల్లి నర్సింగరావు, నాయకులు ఎలేటి నర్సింహారెడ్డి, లడె రాజేందర్, శ్రీనివాస్, జనార్ధన్, చంద్రబోస్ తదితరులు పాల్గొన్నారు

బీఆర్ఎస్ బైక్ ర్యాలీ

చిట్యాల: భూపాలపల్లి నియోజకవర్గ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి గండ్ర వెంకట రమణారెడ్డిని గెలిపించాలని కోరుతూ సోమవారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ నేతలు బైక్ ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని పలు వీధుల్లో తిరిగి గండ్ర వెంకటరమణారెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. మండల నాయకులు కోత్తూరి రాజిరెడ్డి, కట్కూరి నరేందర్, పాండ్రాల స్వామి, ఆరెపల్లి సమ్మయ్య, కట్కూరి రాజేందర్, పెరుమాండ్ల రవీందర్ గౌడ్, గుర్రపు తిరుపతి గౌడ్, తొటం నవీన్, బుర్ర శ్రీధర్, కనకం తిరుపతి, ముసాపూరి రవీందర్, రాకేష్ పాల్గొన్నారు.



రేగొండ: మాట్లాడుతున్న గండ్ర వెంకటరమణారెడ్డి

ఆదరించండి.. అభివృద్ధి చేస్తా..



ప్రచారం వాహనంపై నుంచి ప్రజలకు అభివాదం చేస్తున్న పొదెం వీరయ్య



ర్యాలీలో పాల్గొన్న కాంగ్రెస్ శ్రేణులు

భద్రాచలం: ఈ నెల 30వ తేదీన జరగబోవు సార్వత్రిక ఎన్నికల్లో హస్తం గుర్తుపై ఓటు వేసి ఆదరించాలని భద్రాచలం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పొదెం వీరయ్య కోరారు. సోమవారం భద్రాచలం పట్టణంలో ప్రచార యాత్ర నిర్వహించారు. పట్టణంలోని సుభాష్ నగర్, శాంతినగర్ మెడికల్ కాలనీ, ఎస్ఆర్ఎన్ కాలనీ, రాజరాజేశ్వరి టెంపుల్ ఏరియా, ఇండస్ట్రియల్ ఏరియా, కొత్త కాలనీ, అశోక్ నగర్ కాలనీలలో ప్రజలందరికీ అభివాదం చేస్తూ ఎన్నికల ప్రచార యాత్ర కొనసాగించారు. ప్రతీ ఏరియాలో స్ట్రీట్ కార్నర్ మీటింగ్ ద్వారా ప్రజలతో మాట్లాడారు. రానున్న కాంగ్రెస్ ప్రభుత్వంలో భద్రాచలాన్ని, భద్రాచల రామాలయాన్ని అభివృద్ధి చేసే బాధ్యత తనదేనని, రామాలయాన్ని అభివృద్ధి చేసేందుకు మరో రామదాసు లాగా, ఆంజనేయ స్వామి లాగా రామునికి, భద్రాచలం ప్రజలకు సేవ చేసుకునేందుకు అవకాశం ఇవ్వాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణతో పాటు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక

భద్రాచలంటౌన్: భద్రాచలంకు చెందిన పలువురు బీఎస్పీ నాయకులు సోమవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే పొదెం వీరయ్య వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించాక మాట్లాడారు. రాబోయే కాంగ్రెస్ ప్రభుత్వంలో అందరం కలిసి భద్రాద్రి అభివృద్ధికి, సమస్యల పరిష్కారానికి కృషి చేద్దామన్నారు. పట్టణ అధ్యక్షుడు నరేష్, నాయకులు శ్రీనివాస్, వెంకటేశ్వరరావు, సత్యలింగం, సుధీర్, వెంకటేష్ పాల్గొన్నారు.

నిజాలు, అబద్ధాలపై చర్చించాలి

మంథని: అసత్యాలను నిజాలుగా చూపించే ప్రయత్నం చేస్తున్న కాంగ్రెస్ కుటిల రాజకీయాలను ప్ర జలు గుర్తించి గుణపాఠం చేప్పాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పుట్ట మధు కోరారు. గుంజపడుగు, నాగారం, ఆరెంద గ్రామాల్లో సోమవారం ఆయన ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మధుకు ప్రజలు బ్రహ్మరథం పట్టారు. ప్రజలు ఓట్లు వేసి ఎమ్మెల్యేగా గెలిపించిన ప్రస్తుత కాంగ్రెస్ అభ్యర్థి.. పనికోసం వెళ్తే.. తమ ప్రభుత్వం లేదని మాట దాటేశారని ఆరోపించారు. కేవలం ఓట్లకోసం నోట్ల సంచులు తీసుకొచ్చి ప్రజలను మభ్యపెట్టడం అలవాటుగా మారిపోయిందని పేర్కొన్నారు. ఆనాడు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని వ్యతిరేకిస్తూ తుపాకులు పట్టుకుని అడవిబాట పట్టినోళ్లు.. వాటిని వదిలేసివచ్చి మళ్లీ అదే పార్టీలోకి వెళ్తున్నారని, వీళ్లంతా ఒక్కటై తనను అంతం చేయాలని కుట్రలు చేస్తున్నారని మధు ఆందోళన వ్యక్తం చేశారు. గెలిచిన నెల రోజుల్లో గుంజపడుగును మండలంగా ఏర్పాటు చేయిస్తానని హామీ ఇచ్చారు.